# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 2.10.2025 | 24 క్యారెట్లు 11,93.400 | కిలో వెండి 1,61,000 | 24 °C | సంపుటి:3 | సంచిక:275

www.vishalabharati.com


## తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి

- రాష్ట్ర డీజీపీగా సీనియర్ ఐపీఎస్
- శివధర్ రెడ్డి బాధ్యతలు
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటన
- శాంతిభద్రతలను కాపాడుతాం
- ఇదొక స్టాండర్డ్ ప్రొటోకాల్
- సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతుంది
- స్థానిక ఎన్నికలకు సిద్ధంగా

2



తెలంగాణ కొత్త పోలీస్ డైరెక్టర్ జనరల్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ ఉదయం లక్డీకపూల్ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఛార్జ్ తీసుకున్నారు. అనంతరం అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) మహేష్ భగవత్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



## కేసీఆర్ పాలన స్వర్ణయుగమే

### నోరు ఉంది కదాని వాగకూడదు

- నేర గణాంక విభాగం రిపోర్టు
- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు
- పిచ్చి కూతలు కూసే కాంగ్రెస్
- అధికారంతో అహంకారం
- రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానం
- అన్నపూర్ణగా తెలంగాణ

నోరు ఉంది కదాని పారేసుకోవడం కాదు.. జాతీయ నేర గణాంక విభాగం రిపోర్టు వెల్లడించిన నిజాలు తెలుసుకుంటే.. మూసుకుంటారని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ పిచ్చి కూతలు కూసే కాంగ్రెస్ పార్టీకి ఇది చెంపపెట్టులాటిందన్నారు. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో మాట్లాడే ముందు ఈ గణాంకాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

2014లో రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ నేడు 14వ స్థానానికి ఎలా పరిమితం అయ్యిందో చెప్పాలన్నారు. 10ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆత్మహత్యల తెలంగాణను అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. రైతును రాజును చేయాలన్న కేసీఆర్ సంకల్పానికి.. ఆయన చేసిన నిర్విరామ కృషికి వచ్చిన ఫలితం ఇదే అన్నారు. కేసీఆర్ కు రైతుకు ఉన్నది పేగు బంధమని.. ఆత్మ బంధమని అన్నారు. కానీ కాంగ్రెస్ కు ఉన్నది కేవలం ఓటు బంధమే అంటూ విమర్శలు చేశారు. 2014లో రాష్ట్రంలో 1,347 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడగా, 2023 నాటికి ఈ సంఖ్య కేవలం 56కి తగ్గి, 95.84 శాతం రికార్డు స్థాయిలో తగ్గుదల నమోదైందని హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రైతులను రాజులు లా

మిగతా 2లో

# మొదలైన ఎన్నికల వేడి





- కాంగ్రెస్ నేతలు అలర్టయ్యారు
- స్థానిక ఎన్నికలపై ఫోకస్
- వంద శాతం సీట్లు గెలవాలి
- ముఖ్య నేతలతో సీఎం రేవంత్
- అక్టోబరు 5 నాటికి పీసీసీకి
- ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక
- నవంబర్ 11 తర్వాత మున్సిపాలిటీ

2

స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకి వంద శాతం సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది అధికార కాంగ్రెస్ పార్టీ. ఐదు విడతలుగా జరగనున్న ఎన్నికల్లో తొలివిడత నామినేషన్లు అక్టోబరు 9 నుంచి మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు అలర్టయ్యారు. మంగళవారం సాయంత్రం టీపీసీసీ చీఫ్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, డిప్యూటీసీఎం, పలువురు మంత్రులతో సమావేశమయ్యారు సీఎం రేవంత్‌రెడ్డి.



## పోలీసులకు ఐ బొమ్మ వార్నింగ్

- దేశవ్యాప్తంగా పైరసీ భూతం
- సినిమాలకు పెద్ద ప్రాబ్లమ్
- పైరసీపై హైదరాబాద్ పోలీసుల దాడి
- ఐ బొమ్మ వెబ్ సైట్ సమాధానం
- ముఖ్యమైన నోటీసును రిలీజ్
- ఎక్కడ ఫోకస్ చేయాలో అక్కడ చేస్తాం
- ఫోన్ నంబర్లు బయటపెడతాం

ప్రస్తుతం దేశవ్యాప్తంగా పైరసీ భూతం సినిమాలకు పెద్ద ప్రాబ్లమ్ గా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా పైరసీపై హైదరాబాద్ పోలీసుల మెరుపుదాడి నిర్వహించారు. దేశంలోనే అతిపెద్ద పైరసీ ముఠాను పట్టుకున్నారు తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ కేసును ఛేదించిన సీపీ ఆనంద్ పైరసీ ముఠాపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఐ బొమ్మ వెబ్ సైట్ పై ఫోకస్ చేశామని.. దాని వెనకున్న కేటుగాళ్లను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. అయితే తాజాగా ఈ ఘటనపై ఐ బొమ్మ వెబ్ సైట్ ధీటుగా సమాధానం ఇచ్చిం ది. తమ వెబ్ సైట్‌లో ఒక ముఖ్యమైన నోటీసును రిలీజ్ చేసింది. ఐ బొమ్మ మీద మీరు ఫోకస్ చేస్తే మేము ఎక్కడ ఫోకస్ చేయాలో అక్కడ చేస్తాం అని ఆ మెసేజ్ లో ఉంది. డిస్ట్రిబ్యూటర్స్ కు ప్రింట్స్ అమ్మిన తరు వాత మీరు ఎం పట్టనట్టు కెమెరా ప్రింట్స్ తీసిన వాళ్ల మీద కాకుండా మీ ఓటీటీ రెవిన్యూ కోసం ఆలోచిస్తూ

మిగతా 2లో

## మహిళలకు అవమానం

- బతుకమ్మతో గిన్నిస్ రికార్డ్
- రికార్డ్ కోసం వింత పోకడలు
- కవిత మీడియాతో మాట్లాడారు
- మహిళలను అవమానించినట్లే
- లక్ష మందితో బతుకమ్మ
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చారు
- కోటి బతుకమ్మలా జాతర

బతుకమ్మ వేడుకల్లో గిన్నిస్ రికార్డ్ కోసం విచిత్ర వింత పోకడలకు పోవటం దురదృష్టకరమని.. మొదటి నుంచి తెలంగాణ సాంస్కృతిని కాపాడుకునేందుకు ఆరాట పడిన సంస్థ జాగృతి అని కవిత తెలిపారు. హైదరాబాద్ లో మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేవలం పదివేల మందితో ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ పండుగ మహిళలను అవమానించినట్లే ఉందని.. వచ్చే సంవత్సరం జాగృతి ఆధ్వర్యంలో లక్ష మందితో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గిన్నిస్ రికార్డ్ తో ఇది మహిళల పండుగ అని నిరూపిస్తామన్నారు. ప్రభుత్వం మళ్లీ చేస్తే ఆ మరుసటి

మిగతా 2లో



## మహిళలకు రక్షణ కరువే

- మహిళలపై పెరుగుతున్న నేరాలు
- ప్రభుత్వం కఠిన చట్టాల అమలు
- నేరాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు
- జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో
- రిపోర్టులో సంచలన నిజాలు
- 2021లో 4,28,278 కేసులు
- చార్జ్‌షీట్లు 77.6 శాతంగా దాఖలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మహిళలపై నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ని కఠిన చట్టాలను తీసుకువచ్చినా.. నేరాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. నిత్యం ఏదొక ప్రాంతంలో మహిళలకు అరాచకాలకు గురవుతూనే ఉన్నారు. తాజాగా జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 వెల్లడించిన రిపోర్టులో సంచలన నిజాలు బయటకు వచ్చాయి. ఈ నివేదిక తెలిపిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 4,48,211 కేసులు నమోదు అయ్యాయి. 2022లో 4,45,256 కేసులు నమోదు అవ్వగా.. 2021లో 4,28,278 కేసులు నమోదైందని గుర్తించింది. ఎన్సీఆర్బీ తాజా

మిగతా 2లో



## మేడిగడ్డపై సర్కార్ ఫోకస్

- ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం
- మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది
- తీవ్ర సంక్షోభంలో పడింది
- కాళేశ్వరం భవిష్యత్తు ప్రశ్నార్థకం
- సీబీఐ విచారణకు దారి తీసింది
- నీటిని నిల్వ చేసే అవకాశం లేదు
- బ్యారేజీలకు తాత్కాలికంగా రిపేర్లు

2

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా భావించిన కాళేశ్వరం ప్రాజెక్టు, గత ఏడాది అక్టోబరులో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో తీవ్ర సంక్షోభంలో పడింది. ఈ ఒక్క ఘటన కాళేశ్వరం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. అంతేకాకుండా రాజకీయ దుమారానికి కారణమైంది. సీబీఐ విచారణకు దారి తీసింది. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిన ఆ దృశ్యం రాష్ట్ర ప్రజలకు ఇంకా కళ్ల ముందు మెదులుతూనే ఉంది కదా.

## కల్తీ కల్లు.. తనిఖీలు నిల్లు

- రసాయనాలతో కృత్రిమంగా కల్లు తయారీ
- తాగే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- నిషేధించాలంటున్న జనం
- నామమాత్ర తనిఖీలకే 'ఎక్సైజ్' పరిమితం
- నెలనెలా ప్యాకేజీలతో అధికార గణం
- ప్రజల ప్రాణాలతో చెలగాటం

2

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలో కొంత మంది కల్తీ కల్లు తయారు చేసి అమాయక ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. రసాయనాలు, ఇతర పదార్థాలు కలిపి అచ్చం ఈత కల్లులా తయారు చేస్తున్నారు. వీటిని తాగిన జనం అనారోగ్యం భారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంతో ఈ కల్తీ దందా యథేచ్ఛగా సాగుతుందనే ప్రచారం జోరుగా వినిపిస్తోంది.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
2.10.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మురిపించిన 'నైరుతి'

**హైదరాబాద్:** తెలంగాణకు ఈసారి నైరుతి రుతుపవనాలు సమృద్ధిగా వర్షాలనిచ్చాయి. జోరు వానలతో సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆ తర్వాత వారానికి రుతుపవనాలు ముఖం చాటేయడంతో జూన్ నెలంతా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. జూలై మూడోవారం వరకు అదే పరిస్థితి కొనసాగింది. తర్వాత రుతుపవనాలు రాష్ట్రంపై అత్యంత చురుకుగా కదలటంతో మోస్తరు నుంచి భారీ, అతిభారీ, అత్యంత భారీ వర్షాలు కురిశాయి. దీంతో వర్షపాతం గణాంకాలు అమాంతం పైకి ఎగబాకాయి. సీజన్ ముగిసేనాటికి సాధారణాన్ని దాటి అధిక వర్షపాతానికి చేరింది. జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు కాలాన్ని నైరుతి సీజన్‌గా పరిగణిస్తారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో నాలుగు నెలల్లో 74.06 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాలి. సీజన్ ముగిసే నాటికి ఈసారి 98.83 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# మొదలైన ఎన్నికల వేడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూమ్ ద్వారా నేతలతో మాట్లాడారు ముఖ్యమంత్రి. జడ్పీటీసీ సీట్లకు అభ్యర్థుల పేర్లను అక్టోబరు 5 నాటికి పీసీసీకి పంపాలని మంత్రులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అలాగే ముఖ్య నాయకులతో సంప్రదించాలన్నారు. జడ్పీటీసీ స్థానానికి ముగ్గురు బలమైన అభ్యర్థులను గుర్తించాలన్నారు. గెలిచే అవకాశాలున్న అభ్యర్థులను ఆరు లేదా ఏడు నాటికి పీసీసీ ఎంపిక చేస్తుందన్నారు. అభ్యర్థుల ఎంపికలో చిన్న పొరపాటు కూడా చేయవద్దన్నారు. గెలుపే లక్ష్యంగా అడుగులు వేయాలని మంత్రులకు సూచించినట్లు తెలుస్తోంది. ఇకపై నేతలంతా ప్రచారంపై దృష్టి సారించాలని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ఏకాభిప్రాయంతో జరగాలన్నారు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్. ఈ విషయంలో ఎక్కడైనా భిన్నాభిప్రాయాలు తలెత్తితే తుది నిర్ణయం పీసీసీ తీసుకుంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం, గెలుపు వరకు అందరూ కలిసి పని చేయాలన్నారు. ఎంపీటీసీ సీట్లకు జిల్లా నేతలు ఆయా అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. పోటీ అధికంగా ఉంటే పీసీసీ దృష్టికి తేవాలని చెప్పినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఐదులోగా అభ్యర్థుల జాబితా పీసీసీ వద్దకు వస్తే.. ఏడున అభ్యర్థులను ప్రకటించనుంది. అక్టోబర్ 9 నుంచి తొలి విడత నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. స్థానిక సంస్థలకు ఎన్నికల కోడ్ నేపథ్యంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. ఎందుకంటే నవంబర్ 11 తర్వాత మున్సిపాలిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావచ్చని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. దానికి నోటిఫికేషన్ రావడం, ఎన్నికలు, ఆ తర్వాత ఫలితాలు వచ్చేసరికి డిసెంబర్ చివరికి అవుతుందని అంటున్నారు. వచ్చే ఏడాదిలో నామినేటెడ్ పోస్టులు భర్తీ కావడం ఖాయమని వాదనలో ఇంకోవైపు వినిపిస్తోంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కూడా వాయిదా వేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నమాట.

# మహిళలకు రక్షణ కరువే

మొదటి పేజీ తరువాయి



గణాంకాల ప్రకారం, ప్రతి లక్ష మంది మహిళల్లో 66.2 శాతం మంచి మహిళలపై నేరాలు జరుగుతున్నట్లు వెల్లడించింది. ఈ కేసుల్లో చార్జ్‌షీట్లు 77.6 శాతంగా దాఖలు అయ్యాయని నివేదికలో పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా మహిళలపై నేరాల స్థాయిలో స్వల్ప పెరుగుదల కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రాల వారీగా పరిశీలించినట్లయితే.. తెలంగాణలో నేరాల రేటు అత్యధికంగా 124.9 ఉంది. దీనితో దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో రాజస్థాన్ 114.8, మూడవ స్థానంలో ఒడిశా 112.4, నాలుగవ స్థానంలో హర్యానా 110.3, ఐదవ స్థానంలో కేరళ 86.1 నేరాల రేటుతో ఉన్నాయి. కానీ అత్యధికంగా కేసులు నమోదు అయిన స్థానాల్లో ఉత్తరప్రదేశ్ 66,381 తో మొదటి స్థానంలో ఉన్నాయి. తరువాత మహారాష్ట్ర 47,101, రాజస్థాన్ 45,450, పశ్చిమ బెంగాల్ 34,691, మధ్యప్రదేశ్ 32,342 కేసులతో కొనసాగుతుంది. కేసుల వర్గీకరణలో ఎక్కువగా భర్త లేదా కుటుంబ బంధువుల క్రూరత్వం (IPC సెక్షన్ 498A) పై ఆధారపడి 1,33,676 కేసులు నమోదు అయ్యాయి. అలాగే, కిడ్నాప్, అపహరణ కేసులు 88,605, మహిళల గౌరవానికి భంగం కలిగించే దాడులు 83,891, అత్యాచారం 29,670 కేసులు నమోదయ్యాయి. వాటితో పాటు వరకట్న హత్యలు, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి నేరాలు కూడా గణనీయంగా ఉన్నాయి. ఈ గణాంకాలు దేశంలో మహిళల భద్రతా పరిస్థితి మరింత సీరియస్‌గా ఉందని స్పష్టం చేస్తున్నాయి. చట్టాలు ఉన్నప్పటికీ వాటి సమర్థవంతమైన అమలు లేకపోవడం, సామాజిక అవగాహన లోపం, పోలీస్ వ్యవస్థలో అనర్హతలు మహిళలపై నేరాలను తగ్గించలేకపోవడం ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో నేరాల రేటు అత్యధికంగా ఉండడం, ఉత్తరప్రదేశ్‌లో మొత్తం కేసులు ఎక్కువగా ఉండడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా చూపుతోంది. నిపుణులు, మహిళల హక్కులపై పనిచేసే సంస్థలు, ప్రభుత్వానికి మరింత కఠిన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

# మహిళలకు అవమానం



మొదటి పేజీ తరువాయి

సంవత్సరం దాన్ని మించి చేస్తామన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చింతమడక నుంచి లండన్ వరకు పలు ప్రాంతాలు తిరిగానన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి బతుకమ్మ లేకుండా చేశారని..తెలంగాణ ద్రోహి తెలంగాణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. జై తెలంగాణ అనని సీఎం బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొన్నారని విమర్శించారు. రికార్డ్ కోసం బతుకమ్మ చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఈ పండుగను నిలబెట్టుకున్నారు. మేము ఎప్పుడు రికార్డుల కోసం పండుగ నిర్వహించ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కోటి బతుకమ్మలా జాతర చేశామని.. బొడ్డెమ్మ ల నుంచి కోటి బతుకమ్మల వరకు 28 రోజుల పాటు చేశాం. రికార్డుల కోసం కాదన్నారు. తెలంగాణ సాధన కోసం మాత్రమే చేశామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కూడా ఆ విధంగా నిర్వహించి... బతుకమ్మకు బతుకమ్మ చీరలు ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు. మహిళలకు ఏదైనా మంచి జరిగేలా కార్యక్రమం చేయాల్సి ఉందని.. కానీ చేయలేదన్నారు. తెలంగాణ తల్లి బొమ్మ ఎవరు పెట్టారంటే తెలంగాణ ప్రజలు అని మత్రమే రావాలి. రేవంత్ రెడ్డి అని రాకూడదన్నారు. రాజకీయపరమైన రిజర్వేషన్ బిల్లు మీద మాత్రం సమస్యలు వస్తున్నాయని..కేసులు వేసిన వ్యక్తులు రేవంత్ రెడ్డి దగ్గర వ్యక్తులని చాలా మంది చెబుతున్నారన్నారు. వీళ్లేమో ఇలా కేసులు వేస్తారు..ఇక రాష్ట్రపతి వద్ద బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీ వాళ్లు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తారన్నారు. ఈటల రాజేందర్ ఎన్నికలకు వెళ్లవద్దు, డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దు అని అంటారు. ఎన్నికల రిజల్ట్ వచ్చిన తర్వాత కూడా మేము క్యాన్సిల్ చేయిస్తామని అంటారు. ఈటల, బీజేపీ పార్టీ వాళ్లు కోర్టులా, జడ్జిలా అని ప్రశ్నించారు. మీ అధ్యక్షుడు జీవోను స్వాగతిస్తున్నా అంటాడు. ఈటల మాత్రం వేరేగా మాట్లాడుతారు. అసలు ఒక ఉద్యమకారుడిగా పేరున్న ఈటల ఇలా మాట్లాడవచ్చా? బీసీ బిడ్డ అయిన మీరు అలా మాట్లాడతారా తక్షణమే మీరు క్లారిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఇక్కడున్న ఎనిమిది మంది ఎంపీలు వెళ్లి మోడీ కాళ్లు పట్టుకోని రిజర్వేషన్లు తెప్పించాలని సూచించారు. గ్రామ పంచాయితీల వారీగా మీ కులగణనను బయట పెట్టండి అని మేము డిమాండ్ చేస్తున్నామని.. ఇవ్వాళ బీజేపీ మీద బాధ్యత ఉంది. బీసీ బిల్లు పాస్ చేస్తారో లేదో చెప్పాలన్నారు. బీసీ లకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వస్తే...ఆ తర్వాత చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడుతాం. రెండేళ్ల పాటు కాళేశ్వరం రిపేర్ చేయకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం ఎండబెట్టింది. ఆ ఉసురు ఊరుకే పోదు. కచ్చితంగా కాంగ్రెస్ కు తగులుతుందని హెచ్చరించారు.

# పోలీసులకు ఐ బొమ్మ వార్నింగ్

మొదటి పేజీ తరువాయి




మా మీద ఫోకస్ పెట్టారని పేర్కొంది. అంతేకాక మరో సంచలన వ్యాఖ్యలు చేసింది. మా వెబ్ సైట్ ను బ్లాక్ చేస్తే మీ ఫోన్ నంబర్లు బయటపెడతాం అని వార్నింగ్ ఇచ్చింది. మమ్మల్ని టార్గెట్ చేస్తే ఇండస్ట్రీకి పెద్ద షాక్ వస్తుందని పేర్కొంది. రూ. 5 కోట్ల యూజర్లను ఒకేసారి రివీల్ చేయగలమని హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాక.. 'మా టెలిగ్రామ్ గ్రూపులు, సబ్ స్క్రిప్షన్లు బహిర్గతం చేస్తామని.. రూ. 5 కోట్ల మందికి పైగా యూజర్ల సమాచారం మా దగ్గర ఉంది. మీడియా, ఓటీటీ, హీరోలకూ షాకింగ్ వార్త రివీల్ అవుతుంది. ప్రతి యూజర్ ఫోన్ నంబర్ మా డేటాబేస్ లో నిక్షిప్తమై ఉంది. దేశం మొత్తంలో మా సపోర్ట్ ఉంది. మా వెబ్‌సైట్ బ్లాక్ చేస్తే - మీరే ఎక్స్ పోజ్ కు గురవుతారు. ఫ్యాన్స్ కు సీక్రెట్ గా ఉన్న హీరోల పేర్లు బయట పెడతామని పేర్కొంది. కొన్ని ప్రొడక్షన్ హౌజ్ లు, యూట్యూబ్ ఛానళ్లు ఉద్దేశపూర్వకంగా ఐ బొమ్మను తప్పుగా ప్రచారం చేస్తున్నాయని, తాము ఎలాంటి హ్యాకింగ్, ఫోన్ ట్రాకింగ్ చేయబోమని మరోసారి హామీ ఇచ్చింది. అలాగే తమది ఒక భారతీయ సైట్ అని, తెలుగు ప్రేక్షకులకు మాత్రమే అందుబాటులో ఉన్నామని ఐ బొమ్మ స్పష్టం చేసింది. హీరోలకు వందల కోట్లు రెమ్యునరేషన్ ఇచ్చి.. భారీ బడ్జెట్ లు చూపించి సామాన్య ప్రేక్షకులపై ఆ ప్రభావం చూపుతున్నారని ఐ బొమ్మ మండిపడింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టు వైరల్ గా మారింది. దీనిపై అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది.

# మేడిగడ్డపై సర్కార్ ఫోకస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేవలం మేడిగడ్డ మాత్రమే కాదు. కాళేశ్వరం ప్యాకేజీలో భాగమైన అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీల్లోనూ భారీగా సీపేజీలు (నీరు లీకవ్వడం) బయటపడ్డాయి. ఈ మూడు బ్యారేజీలకు తాత్కాలికంగా రిపేర్లు చేసినప్పటికీ, వీటిలో నీటిని నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణపై అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది.



**ఎన్డీఎస్ఏ సూచనల మేరకే డిజైన్ల తయారీ...**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతు పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా దృష్టి సారించింది. ఈ మొత్తం ప్రక్రియను నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సూచనల మేరకు చేపట్టాలని నిర్ణయించారు. ఈ బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన డిజైన్లు, డ్రాయింగులు సిద్ధం చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెండర్ ప్రకటన జారీ చేసింది.

**నిపుణుల నివేదిక ఏమి చెప్పింది?**

మేడిగడ్డ కుంగిన వెంటనే, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు లేఖ రాసింది. దాని ఆధారంగా, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వం వహించారు. ఆ కమిటీ గతేడాది మే నెలలోనే ప్రాథమిక నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో బ్యారేజీల నిర్మాణం, డిజైన్లు, నాణ్యత, నిర్వహణ సహా అనేక వైఫల్యాలున్నట్లు స్పష్టంగా గుర్తించింది. ఆ నివేదిక ఇచ్చిన అత్యంత ముఖ్యమైన హెచ్చరిక ఏమిటంటే: ఈ బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడానికి వీల్లేదని, ఒకవేళ అలా చేస్తే మరింత నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అంతేకాకుండా, బ్యారేజీల పునరుద్ధరణ కోసం పాటించాల్సిన కొన్ని డిజైన్లు డ్రాయింగ్స్ ను కూడా ఈ కమిటీ సూచించింది.

**టెండర్ ప్రక్రియలో కీలక వివరాలు...**

ప్రస్తుతం, రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆ నిపుణుల కమిటీ సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల పునరుద్ధరణ, రెస్టోరేషన్ డిజైన్ల కోసం ప్రసిద్ధ డిజైన్ ఏజెన్సీల నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్‌ను ఆహ్వానించింది. ప్రతిపాదనలను సమర్పించడానికి గడువు ఎప్పుడంటే: ఆసక్తి ఉన్న డిజైన్ ఏజెన్సీలు తమ ప్రతిపాదనలను సీల్ చేసిన కవర్లలో అక్టోబర్ 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి సమర్పించాలి.

**ఎప్పుడు కవర్లు ఓపెన్ చేస్తారు?**

అదే రోజు సాయంత్రం 5 గంటలకు జలసౌధ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఈ కవర్లు ఓపెన్ చేస్తామని నీటిపారుదల శాఖ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఈ ప్రక్రియలో ఎంపికైన ఏజెన్సీలు ఎన్డీఎస్ఏ కమిటీ సూచనల మేరకు మాత్రమే బ్యారేజీల పునరుద్ధరణ డ్రాయింగులు, డిజైన్లు సిద్ధం చేయాల్సి ఉంటుందని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలను ఆ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. బ్యారేజీల డిజైన్లు, డ్రాయింగులు సిద్ధమైతేనే అసలు రిపేర్ పనులు ప్రారంభమవుతాయి. ఈ అక్టోబర్ 15 గడువు తరువాత, కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు, పనుల ప్రణాళికలు వెల్లడవుతాయి.

# తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు. తెలంగాణలో ఇటీవల సంభవించిన సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో శివధర్ రెడ్డి.. కొత్త డీజీపీగా అపాయింట్ అయిన విషయం తెలిసిందే. విలేకరుల సమావేశంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. శాంతిభద్రతలను కాపాడే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పోలీసులకు ఇదొక స్టాండర్డ్ ప్రోటోకాల్ అని గుర్తు చేశారు. అంతర్గతంగా ప్రతి ఒక్క పోలీస్ కానిస్టేబుల్ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని సూచించారు. అలాగే- పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని శివధర్ రెడ్డి తెలిపారు. చాలినంత మంది పోలీసులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల అమలు మరింత మెరుగుపడుతుందని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపైనా కొంత వరకు ఒత్తిడి తగ్గుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి శివధర్ రెడ్డి మాట్లాడారు. దీనికి తాము సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎన్నికలను గ్రామస్థాయిలో సజావుగా నిర్వహించడానికి పోలీస్ వ్యవస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో తమకు బలమైన పోలీస్ నెట్ వర్క్ ఉందని చెప్పారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తామని అన్నారు. మావోయిస్టు కదలికల గురించీ శివధర్ రెడ్డి ప్రస్తావించారు. ఇటీవలి కాలంలో మావోయిస్టు నాయకులు సాయుధ పోరాట మార్గాన్ని విడిచిపెట్టడానికి సుముఖత వ్యక్తం చేస్తోన్నారని, లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా సహాయక సహకారాలను అందిస్తామని అన్నారు. మావోయిస్టుల సిద్ధాంతం ఆచరణలో విఫలమైందని చెప్పారు. ఆధునికీకరణ, పోలీసు చర్యలతో పాటు పునరావాస కల్పన ద్వారా తీవ్రవాదాన్ని ఎదుర్కోవచ్చని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాకూ శివధర్ రెడ్డి హెచ్చరికలు చేశారు. నిర్మాణాత్మక, సద్విమర్శలు చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని అన్నారు. కట్టుబాట్లు దాటి, హద్దులు మీరి ప్రవర్తించితే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ వార్తలు వ్యాప్తి చేసే వారినీ వదలిపెట్టబోమని చెప్పారు. వేరొకరి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, ఇష్టానుసారంగా పోస్టులు పెడితే తప్పకుండా చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. తమకు పింక్, బ్లూ, రెడ్ బుక్ వంటివేవీ ఉండవని, తెలిసిందంతా ఖాకీ బుక్ మాత్రమేనని శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ ఖాకీ బుక్ లో సీఆర్పీసీ, బీఎన్ఎస్, చట్టాల గురించి ఉంటుందని, తాము దానినే అనుసరిస్తామని పేర్కొన్నారు. మిగతా బుక్ లతో తమకు సంబంధం ఉండబోదని వ్యాఖ్యానించారు.



## కేసీఆర్ పాలన స్వర్ణయుగమే

మొదటి పేజీ తరువాయి



చూడాలన్న దృఢ సంకల్పానికి, నిర్విరామ కృషికి ఇది ప్రతిఫలమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రైతుల సంక్షేమానికి అమలు చేసిన పథకాల ప్రభావం గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, పంటల సరఫరా, కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి పథకాలు రైతులకు భరోసా, ఆర్థిక స్థిరత్వం అందించాయని హరీశ్ రావు వివరించారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో నిత్య దుర్భిక్షం, సాగు విధ్వంసం, వలసల దురవస్థ, ఆత్మహత్యల సంఘటనలు సాధారణం కావడం గమనార్హం. అయితే స్వరాష్ట్ర ఏర్పాటుతో, కేసీఆర్ పథకాల వల్ల తెలంగాణ సస్యశ్యామల భూభూమి, సాగు ప్రగతితో, ధాన్యపురాశులతో సుఫలంగా మారిందని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఇక 2014 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల సంఖ్య 1,347 నుండి 56కి తగ్గడం, దేశంలో మొత్తం రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 10.9 శాతం నుంచి 0.51 శాతానికి పడిపోవడం, కేసీఆర్ పాలనలో రైతుల సంక్షేమానికి వచ్చిన గణనీయమైన ఫలితాన్ని సూచిస్తుంది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాకతోనే పరిస్థితులు మారిపోయాయని, గత రెండు సంవత్సరాలలో 700 మందికి పైగా రైతులు మళ్లీ ఆత్మహత్యలకు పాల్పడారని ఆయన పేర్కొన్నారు. హరీశ్ రావు ఆ ప్రకటన ద్వారా కేసీఆర్ పాలనలో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగానికి ఇచ్చిన ఊపిరి స్పష్టమని, ఇప్పుడు ఆ ఫలితాలను కొనసాగించేందుకు ప్రభుత్వ నిష్పక్షపాత చర్యలు అవసరమని గుర్తుచేశారు. అటు ఇదే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా స్పందించారు. తెలంగాణ 2014 నుంచి 10ఏండ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న ఎన్సీఆర్బీ నివేదకపై ఆయన మాట్లాడారు. తన అధికారిక సోషల్ మీడియాల అకౌంట్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కేసీఆర్ రైతు బంధు పాలన రైతులకు స్వర్ణయుగమే అని మరోసారి రుజువైందన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల వల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు.

# కల్తీ కల్లు.. తనిఖీలు నిల్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇటీ వల కూకట్ పల్లిలో కల్తీ కల్లు సేవించి 13 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా ఆ శాఖ నామమాత్రపు తనిఖీలకే పరిమితమైందనే విమర్శలున్నాయి.కొరడా ఝుళిపించకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

రంగారెడ్డి జిల్లాలో వందల సంఖ్యలో ఈత చెట్లు ఉండగా ప్రతీరోజు వేలాది లీటర్లకు పైగా కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం.ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో చెట్లు తక్కువగా ఉన్నప్పటికీ తయారయ్యే కల్లు అధికం.మొత్తంగా 5 శాతం కల్లు ఉంటే 85 శాతం రసాయనాలతోనే తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు..**

కల్లులో రసాయనాలు, నీళ్లు, ఇతర పదా ర్థాలు కలిపి భారీ మొత్తంలో తయారు చేసి కాంపౌండ్లలో విక్రయిస్తున్నారు. వీటిని తాగిన వారి శరీర అవయవాలు పనిచేయ కుండా పోయి ప్రాణాంతకంగా మారుతోంది.క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్ వంటివి అధిక మోతాదులో కలప డంతో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. శ్వాస తగ్గిపో వడం,బీపీ తగ్గడం,కోమాలోకి వెళ్లడంతో పాటు మరణం సంభవిస్తుంది. కాలేయం,కిడ్నీలపైనా వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.కల్తీ కల్లు ప్రాణాలు తీస్తుందని తెలిసినా చాలా మంది దానికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటు న్నారు. తక్కువ ధరకే దొరుకుతుండటంతో తాగి అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. చెట్ల నుంచి వచ్చే

**తయారీ ఇలా...**

స్వల్పంగా సేకరించిన కల్లులో నీటితో పాటు రసాయనాలు అధిక మోతాదులో కలుపుతున్నారు. ముఖ్యంగా క్లోరల్ హైడ్రేట్, అల్ప్రజోలం, డైజోఫామ్, ఓపీఎం ఇతడ రసాయనాలను కలిపి కృత్రిమ కల్లు తయారు చేస్తున్నారు. వీటిని తాగిన వారు మత్తులో తూగుతున్నారు. పులుపు కోసం లెమన్ సాల్ట్, తీపి కోసం షాక్రిన్, పులియ బెట్టడానికి డైయిస్ట్ పౌడర్, తెలుపు కోసం టైటానియం డయాక్సైడ్, నురుగు కోసం కుంకుడుకాయ ఇతర రసాయనాలు కలుపు తున్నారు. ఇది అచ్చం ఈత, తాటికల్లు లాగా కనిపిస్తోంది. కానీ



ఇందులో ఒక శాతం కూడా వాటి ఆనవాళ్లు ఉండడం లేదని పలు వురు పేర్కొంటున్నారు.

**మామూళ్ళ మత్తులో ఎక్సైజ్ అధికారులు...**

జిల్లాలో యథేచ్ఛగా కల్తీకల్లు భారీగా తయారు చేసి లక్షలాది రూపాయలు మద్యం ప్రియుల నుండి దోచుకుంటూ వారి ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవ హరిస్తున్నారు. కేవలం కల్లు వ్యాపారులు, మద్యం వ్యాపారులు నెలనెలా ప్యాకేజీలు అందిస్తుండడంతో కనీసం తనిఖీలు కూడా చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తే సమాధానం దాట వేస్తూ వ్యాపారులకు మద్దతు పలకడం శోచనీయం.ఎక్కడా లేని విధంగా రంగారెడ్డి జిల్లాలో ఎక్సైజ్ అధికారుల తీరు విస్మయా నికి గురి చేస్తోంది. నెలనెలా లక్షలాది రూపాయలు అధికారులకు ముట్టజెప్పుతున్నట్లు వ్యాపారు లు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
2.10.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily




## డీజీపీనీ కలిసిన ఉప్పల



ఎల్బీనగర్, విశాలభారతి:

తెలంగాణ నూతన డిజిపి బత్తుల శివధర్ రెడ్డి ని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి దసరా పండుగ శుభకాంక్షలు తెలియజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త,ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ డీజీపీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శివదర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ సారధ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ సజావుగా సాగాలని ఆయన అన్నారు.



## దుర్గామాత సన్నిధిలో రవి ప్రసాద్ గౌడ్

సికింద్రాబాద్, విశాలభారతి:

దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉప్పరబస్తీలోని ఆరుట్ల మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అమ్మ వారి పూజ, అన్నదానంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ పాల్గొని మాత నవరాత్రులు జాగరణలు ఉపవాస దీక్షతో అమ్మవారి కటాక్షం పొంది అందరికీ మేలు జరగాలని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో మధు సాగర్, శ్రీధర్,శేఖర్, పవన్, గగన,మైకల్ శీను, పేపర్ వేణు తదితరులు పాల్గొనడం జరిగింది.




## సిక్కుల ర్యాలీ ప్రశాంతంగా నిర్వహించాలి

### రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాస్

రాజేంద్రనగర్, విశాల భారతి:

సిక్కులు తమ ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించాలని రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాస్ సూచించారు. బుధవారం రాజేంద్రనగర్ లోని తన కార్యాలయంలో ఆయన సిక్కు, ముస్లిం సోదరులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సిక్కులు నిర్వహించే ర్యాలీపై ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఎలాంటి వదం తులను నమ్మొద్దని తెలిపారు. అందరూ ప్రశాంతంగా పండుగలను జరుపుకోవాలని తెలి యజేశారు. ఏమైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రాజేంద్రనగర్ లో చాలా ఏళ్లుగా ప్రజలు కలిసిమెలిసి పండుగలను జరుపుకొంటున్నారని అందరూ మతసామరస్యం పాటించాలని ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. అనంతరం అత్తాపూర్ సిఐ నాగేశ్వరరావు సిక్కుల ర్యాలీ పై పలు సలహాలు సూచనలు అందజేశారు



## ప్రభుత్వ ఆసుపత్రిలో వృత్తి విద్యపై అవగాహన కార్యక్రమం

అడవిదేవులపల్లి, విశాలభారతి:

బొత్తలపాలెం తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా అడవిదేవులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వృత్తి విద్యపై పది రోజుల పాంటు ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ప్రతేక శిక్షణలో విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించడంలో సూత్రాలు,ల్యాబ్ వినియోగం ఏ మందులు దేనికి ఇవ్వాలో అనే వాటి మీద పరిజ్నానం వంటివి పాఠశాల సెలవుల్లో నేర్పించడం జరిగిందని మండల వైద్యాధికారి ఎండి అజార్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా తమ నైపుణ్యాలను పెంపొందించుకొని, రోగులకు ఎలా సహాయం చేయాలో నేర్చుకోగలుగుతారు. ఆసుప్రతి సిబ్బంది వారిచే అందించబడిన ఈ శిక్షణ కార్యక్రమం,దసరా సెలవుల సంద్భంగా మాత్రమే కాకుండా, ఇతర సెలవులలో కూడా నిర్వహించ బడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొత్తలపాలెం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పోల నరహరి, ఒకేషనల్ ట్రైనర్ పేరుపాక దుర్గ,ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అమ్మవారి పూజలు

సికింద్రాబాద్,విశాలభారతి :

అమ్మవారి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మహా శక్తి అమ్మవారు ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు భాగంగా మహాహెూమం నిర్వహించడం అయినది. స్వయంగా హెూమం మీద కూర్చుని బండి సంజయ్ కుమార్ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారి కృపకు అందరూ పాత్రులు కావాలని అందరికీ అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రత్యేకమైన పూజ నిర్వహించారు. దేవాలయం వేలాది భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ హెూమం కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు , ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు , అధికార ప్రతినిధి ఎన్వి సుభాష్, మాజీ పార్లమెంట్ సభ్యులు చాడ సురేష్ రెడ్డి మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు

### డాక్టర్ వర్త్యవత్ రాజు నాయక్

ఇబ్రహీంపట్నం, విశాలభారతి:



చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగ పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు నందివనపర్తి మాజీ సర్పంచ్ డాక్టర్ వర్త్యవత్ రాజు నాయక్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా ప్రజల జీవితాలలో కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షిస్తూ, దసరా పండగ మనిషిని మంచి మార్గంలో నడిపించడానికి ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాల పిట్టను దర్శించు కోవడం తెలం గాణకు ప్రత్యేకమని గుర్తు చేశారు. తెలంగాణ అప్రతిహత విజయాలతో అభివృద్ధి సాధించాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆయన దుర్గామాతను ప్రార్థించారు.

## జెడ్పిటిసి, ఎంపీపీ స్థానం దక్కడం హర్షనీయం

### స్థానిక ఎమ్మెల్యేను సన్మానించిన లంబాడి నాయకులు

తిరుమలగిరి , విశాలభారతి:



తిరుమలగిరి మండల కేంద్రంలో జెడ్పిటిసి, ఎంపీపీ రిజర్వేషన్లు రెండు స్థానాలు ఎస్టి జనరల్ అయినందుకు స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ కు శాలువతో సన్మానించి మండల లంబాడి నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్మిలాల్ నాయక్ లంబాడీలకు మండలంలో జెడ్పిటిసి, ఎంపీపీ స్థానం దక్కడం హర్షనీయం అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు కు కృతజ్ఞతలు తెలిపారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ గిరిజన లంబాడీలను రిజర్వేషన్లు స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించిన ప్రజాపాలన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ ప్రభుత్వం అమలు చేయని విధంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ఎస్టీలకు అత్యధిక స్థానాలను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందన్నారు. గతంలో రెండు పర్యాయలు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను తీరని అన్యాయం జరిగింది అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గిరిజనులు లంబాడీలు బంజారాలు ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమ ంలో ఎక్కువ శాతం ఎస్టీ, ఎస్సీ, బీసీలు ఆత్మబలిదానం చేసుకున్నారని ఆయన అన్నారు. ఆత్మబలిధనం చలించిన కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించారని ఆయన అన్నారు. మండలంలో జడ్పిటిసి , ఎంపీపీ రెండు స్థానాలు బంజారా గిరిజనులకు రిజర్వేషన్ జారీ చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. శాసనసభ ఎన్నికల్లో నేను అత్యధిక మెజార్టీతో గెలవడానికి బంజారా లంబాడీలు నాయకులు అక్క , చెల్లెలు , అన్నదమ్ములు ఎంతో కృషి చేసినారు అని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీ లలో రైతు రుణమాఫీ ఉచిత ఇద్యుత్, గృహాలకు ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం లాంటి పథకాలను ప్రజాపాలన అమలు చేశారని ఆయన అన్నారు. రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జడ్పిటిసి, ఎంపీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని రెండు స్థానాలు దక్కించుకోవాలని గిరిజన బంజారా లంబాడి నాయకులకు కోరుతు, నియోజకవర్గం లో ఉన్న లంబాడి గిరిజన సోదర, సోదరీమణులందరికీ ముందుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న, మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ , కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్మిలాల్ నాయక్, ఎస్టి సెల్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పిఏసిఎస్ డైరెక్టర్ కిష్టు నాయక్, సంత్ సేవాలాల్ మండల కమిటీ అధ్యక్షులు బానోతు రాములు నాయక్, మండల నాయకులు ధరావతు రామోజీ, రాంసింగ్, గ్రామ పార్టీ అధ్యక్షులు గుగులోతు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాల జోరుకు బ్రేక్ ఎప్పుడు..?

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:



పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే మాటలన్నీ కాగితాలకే పరిమితమైపోతున్నాయి. మున్సిపల్ కమీషనర్ సెలవు సాకుతో 5వ, 6వ వార్డులలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్రజలు, స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యంగానే మిగిలింది. ఇంచార్జ్ కమీషనర్ అమరేందర్ రెడ్డి వద్దకు ఫిర్యాదులు చేసినా, ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందనే లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కొందరు నాయకుల కుమ్మక్కుతో ఈ అక్రమ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ దొరకడం మున్సిపల్ ఆదాయానికి గండిపెడుతోందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ అభివృద్ధి పేరుతో ఇస్తున్న అనుమతులను అక్రమంగా మలచుకుంటూ కొందరు బెనిఫిట్ పొందుతున్నారని, పేద ప్రజలు మాత్రం హక్కులు కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ''నియమాలు సామాన్యులకు, లంచాలు ఇచ్చేవారికి స్వేచ్ఛా రాజ్యం" అన్నట్లుగా మున్సిపాలిటీ వ్యవహరిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ ఆదాయానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లేలా జరుగుతున్న ఈ అవకతవకలపై తక్షణమే ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## స్థానిక ఎన్నికలలో అభ్యర్థుల గెలుపుకి కృషి చేయాలి

### బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:



గత బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని, అవినీతిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేస్తేనే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపు సాధ్యమవుతుందని తెలిపారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, అవినీతి అక్రమాలతో పాలన సాగిస్తోందని విమర్శించారు. ఈ విషయాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ పార్టీ బలాన్ని మరింత పెంచాలని శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామ్ రెడ్డి, జగదీష్, వెంకట్ రెడ్డి, ధనుంజయ్ గౌడ్, కిరణ్ కుమార్, సాయికుమార్, జ్ఞానేశ్వర్ గౌడ్, రాధాకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బీసీలు లేని గ్రామానికి బీసీ రిజర్వేషన్

### ఎస్టీలు లేని తండాకు ఎస్టీ రిజర్వేషన్

### విచిత్ర నిర్ణయంపై గ్రామస్తుల తీవ్ర అభ్యంతరం

### రిజర్వేషన్లు జనాభా శాతం ఓట్ల శాతం ఆధారంగానే ఇవ్వాలి

### లూనావత్ కృష్ణ నాయక్ డిమాండ్

మహబూబాబాద్ , విశాలభారతి:



మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని బంచరాయితండ, గ్రామంలో సర్పంచ్ పదవుల రిజర్వేషన్ కేటాయింపులు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. బీసీలు లేని చోట బీసీలకు, ఎస్టీలు లేని చోట ఎస్టీలకు రిజర్వేషన్ కేటాయించడం స్థానిక ప్రజల్లో ఆగ్రహాన్ని రేపుతోంది. బంచరాయి తండలో సుమారు 950 మంది ఓటర్ల జనాభా ఉండగా, బీసీ మహిళా కుటుంబాలు కేవలం రెండు మాత్రమే ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అయినా బీసీ రిజర్వేషన్ కేటాయించడం వెనుక ఉన్న తార్కికతను ప్రజలు ప్రశ్నిసు _న్నారు. "ఓటు శాతం, జనాభా శాతం ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి కానీ, కులం లేని చోట ఆ కులానికి రిజర్వేషన్ పెట్టడం ఎలా న్యాయం అవుతుంది?" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై యూత్ అధ్యక్షులు లూనావత్ కృష్ణ నాయక్ మండిపడుతూ, "మేము బీసీలకు, ఎస్సీలకు, ఎస్టీలకు, ఓసీలకు, మైనార్టీలకు రిజర్వేషన్లు ఇవ్వవద్దని అనడం లేదు. కానీ గ్రామాల్లో ఉన్న జనాభా క్రమాన్ని పరిశీలించి ఇవ్వాలి. ఐదు ఓటర్లు ఉన్న చోట రిజర్వేషన్ కేటాయించి, 950 మంది ఓటర్లకు అన్యాయం చేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యం?" అని ప్రశ్నించారు. ఆయన మరింత తీవ్రంగా మాట్లాడుతూ, "మా తండాలో మా రాజ్యం అనే నినాదం మీకు తెలియదా? మా హక్కులను హరించడమా? మా జాతికి అనగదొక్కే ప్రయత్నమా? వెంటనే ఎన్నికల కమిషనర్ ఈ తప్పును సవరించి, సరికొత్తగా రిజర్వేషన్ కేటాయింపులు చేయాలి. లేకపోతే తండా ప్రజలు తీవ్ర ఆందోళనకు దిగుతారు" అని హెచ్చరించారు.



## మున్సిపల్ కమీషనర్ పని తీరుపై ఆగ్రహం

రాజేంద్రనగర్, విశాలభారతి:

శంషాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్,అటెండర్స్, వాటర్ మెన్స్ ,ఎలక్ట్రిషన్, సూపర్వైజర్స్, డ్రైవర్స్, స్వీపర్స్, కామాటి తదితర కార్మికుల బ్రతుకులతో ఆడుకుంటున్న కమిషనర్ సుమన్ రావు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు శంషాబాద్ మున్సిపాలిటీ సంగం గౌరవ అధ్యక్షుడు జగ్గల సామెల్ మాట్లాడుతూ శంషాబాద్ లో ఉన్న కమిషనర్ సుమన్ రావు కార్మికుల యొక్క బ్రతుకులతో ఆటలాడుకుంటున్నాడని అన్నారు. పై అధికారులు కార్మికుల సమాచారాన్ని పంపించమంటే రికార్డులో ఉన్నది కాకుండా తన ఇష్టం వచ్చినట్లుగా తేదీలు మార్చి కార్మికులకు నష్టం జరిగేటట్లుగా తొలగించే విధంగా దొంగ రికార్డును ఈ కమిషనర్ పై ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది అని అన్నారు గ్రామపంచాయతీలో ఈ కార్మికులు 1998 , 2001 నుండి పనిలో చేరారని అట్టి రికార్డును మునిసిపాలిటీ ఏర్పడినప్పుడు ఆఫీసుకు అన్ని వివరాలతో తీసుకున్నారు కానీ ఇప్పుడు అది దాటేసి వీళ్ల రికార్డును తారుమారు చేసి తప్పులు తడకగా కమిషనర్ చందు అనే ఆపరేటర్ తో మరియు శ్రావణి అనే మేనేజర్ మేడం తో ఈ పేర్లను నమోదు చేయించి మున్సిపాలిటీ ఏర్పడినప్పుడు వీళ్ళందరూ పనిలో చేరారని తప్పుగా లిస్టును పై అధికారులకు పంపించారు ఇది కార్మికుల బ్రతుకులతో కచ్చితంగా వీళ్ళందర్నీ తొలగించే ప్రయత్నంలో ఈ కమిషనర్ ఉన్నట్లు తెలుస్తుందని అర్థమవుతుంది అని అన్నారు వెంటనే ఈ కమిషనర్ స్పందించి పైకి పంపించిన లిస్టును మళ్లీ తీసుకొని వాళ్లు పనిలో చేరిన తేదీలను కచ్చితంగా రికార్డు ప్రకారము నమోదు చేసి పంపించాలని డిమాండ్ చేశారు అలాగే రికార్డు చూడకుండా లిస్టు తయారు చేసిన వారిపై ఆపరేటర్ చందును, మేనేజర్ శ్రావణి మేడంను తగిన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాము. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాలిటీ సంగం అధ్యక్షులు ప్రవీణ్ డి .నాగేష్ మున్సిపాలిటీ సంఘం జిల్లా నాయకులు .జయేందర్ మున్సిపాలిటీ సంఘం జిల్లా నాయకులు శంషాబాద్ మున్సిపాలిటీ కమిటీ సభ్యులు దశరథ, సత్తయ్య, రవి, శ్రీను , సాయి తదితర కార్మికులందరూ పాల్గొన్నారు.




## భారీగా మొబైల్ ఫోన్ల రికవరీ

### నాగోల్ పోలీసులు

పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:

నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు నెలలుగా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి యజమానులకు అందజేయడంలో పోలీసులు విజయవంతమయ్యారు. దూరవాణా శాఖ సహకారంతో తెలంగాణా పోలీస్ కేంద్ర పరికరాల గుర్తింపు రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా మొత్తం 32 మొబైల్ ఫోన్లు వెతికి యజమానులకు అందజేశారు. పోలీసుల ఈ చర్యతో మొబైల్ ఫోన్లు తిరిగి పొందిన వారు సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు సాంకేతిక వనరులను సమర్థంగా ఉపయోగిస్తున్నారని ప్రశంసించారు. ఈ క్రమంలో క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. నర్సింహా, క్రైమ్ కానిస్టేబుళ్లు సుభాష్, సాయిశ్, శ్రీకాంత్, హిమబిందు కీలకంగా శ్రమించారు. వీరి కృషిని గుర్తిస్తూ ఏసీపీ కృష్ణయ్య గౌడ్, ఇన్స్పెక్టర్ మక్బుల్ జానీ ప్రత్యేకంగా అభినందించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
2.10.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## 3న ఎపి కేబినేట్ భేటీ

**అమరావతి:** ఏపీ కేబినెట్అక్టోబర్ 3వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమవ్వనుంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఏపీ పర్యటన, జీఎస్టీ సహా పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించనుంది. ఈ నెల 16వ తేదీన ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం జీఎస్టీపై కర్నూలులో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కార్యక్రమాలకు సంబంధించి మంత్రివర్గంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏపీలో నిర్వహించ నున్న జీఎస్టీ కార్యక్రమాలకు సంబంధించి కేబినెట్ సమావేశంలో మంత్రులకు దిశానిర్దేశం చేయనున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి కేబినెట్ చర్చించనుంది. కొత్త జిల్లాల ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారని సమాచారం.



## రోడ్డు భద్రత సిబ్బందికి ఆర్థిక సహాయం

రాజేంద్రనగర్, విశాలభారతి:

దసరా, బతుకమ్మ పర్వదినాల పురస్కరించుకొని బండ్లగూడ జాగీర్ బీజేఎంసీకి చెందిన రోడ్డు శుభ్రత సిబ్బందికి దుస్తులు మరియు ఆర్థిక సహాయం అందజేసిన ఏసీఎఫ్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త పీసరి వినయ్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంలో వారి కృషి, అంకితభావానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటివారు సమాజంలో ఉండడం వల్లనే మనం అందరం ఆరోగ్యంగా బతుకుతున్నామని దానికి అంతటి కారణం వీరి శ్రమ ఫలితమేనని కాబట్టి పండుగ దినాలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఈ సహాయాన్ని అందజేస్తున్నట్లు అని తెలిపారు.

## దుర్గామాత ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేలళ ఉండాలి

### మండల సత్యం కురుమ

మునుగోడు, విశాలభారతి:

బి ఆర్ఎస్ మునుగోడు మండల పార్టీ అధ్యక్షులు మందుల సత్యం మునుగోడు నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు . దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి ఆకాంక్షించారు అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలి ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు



## విజయదశమి శుభాకాంక్షలు



రావుల శ్రీను

మునుగోడు, విశాలభారతి:

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా పండుగ పురస్కరించుకొని మునుగోడు నియోజకవర్గ ప్రజలకు రావుల శ్రీను నాయక్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా ప్రజల జీవితాలలో కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షిస్తూ, దసరా పండగ మనిషిని మంచి మార్గంలో నడిపించడానికి ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలయ్ బలయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని గుర్తు చేశారు.

## ఎమ్మెల్యే అనుచరుల దాడి

### గుంటూరు ఎస్పీ కార్యాలయం ముందు మహిళల ధర్నా

**గుంటూరు:** గుంటూరు ఎస్పీ కార్యాలయం ముందు మహిళల ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అనుచరులు తమపై దాడి చేసి ఇబ్బంది పెట్టారంటూ కోటేశ్వరమ్మ అనే మహిళ ఆమె కూతురుతో కలిసి ఎస్పీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. తమపై దాడి జరిగిందని మేడికొండూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే, సీఐ దురుసుగా వ్యవహరిస్తున్నారు అని బాధిత మహిళలు పేర్కొంటున్నారు. గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు గాని నిందితుల్ని అరెస్టు చేయలేదంటున్నారు. మైనర్ బాలిక దాడి కేసులో నిందితులపై కఠినంగా చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. రోశయ్యతో పాటు మరి కొంత మంది మా మామయ్యపై నాపై నడి రోడ్డులో దాడి చేశారు అని బాధిత మహిళ బంక కొటేశ్వరమ్మ తెలిపింది. మాపై కేసు పెడితే మీకు పథకాలు రాకుండా చేస్తామని బెదిరిస్తున్నారు.. సెప్టెంబర్ 14వ తేదీన మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు అని ఆవేదన వ్యక్తం చేసింది. మేము కేసు పెడితే మా పైనే తిరిగి అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అనుచరులమని తమను బెదిరిస్తున్నారు.. మమ్మల్ని కొట్టిన వారిని సాక్ష్యం చెప్పకుండా పోలీసులు భయపెడుతున్నారు.. కొట్టిన వారిని అరెస్ట్ చేయకుండా మమ్మల్ని విచారణ పేరుతో పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు అని బాధిత మహిళ ఆరోపించింది.

## గూగుల్ డేటా సెంటర్‌ను అడ్డుకునే యత్నం

**విశాఖపట్నం:** గూగుల్ డేటా సెంటర్ కోసం భూ సేకరణలో రైతులకు తెలీకుండా కోర్టులో తప్పుడు కేసులు ఫైల్ చేసిన ఉదంతంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విశాఖ ఎయిర్ పోర్టులో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీఎంకు స్వాగతం పలికిన అనంతరం డేటా సెంటర్ భూసేకరణ ప్రగతిని.. ఆ ప్రాంత రైతుల అభిప్రాయాలను సీఎంకు వివరించారు. ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుకు ఆటంకాలు సృష్టించే ఆలోచనతో వైకాపా పెద్దల తరఫున పని చేస్తున్న బినామీ విషయంలో గట్టి చర్యలకు సీఎం ఆదేశించారు. రైతులకు తెలీకుండా వారి పేర్లతో కోర్టులో కేసు వేయడం.. ఆ పేర్లలో మృతి చెందిన రైతు పేరు ఉండడం పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. భూములిచ్చిన రైతులకు ఉద్యోగావకాశాలు, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్ల నిర్మాణానికి 3 సెంట్ల స్థలం గురించి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. భూసేకరణ ప్రాంతాల్లో ఒకసారి పరిహారం ప్రకటించిన తర్వాత దాన్ని పెంచడమనేది ఎక్కడా లేదని.. కేవలం ఇక్కడి రైతుల అభ్యర్థన దృష్టిలో ఉంచుకుని ధర పెంచామనే విషయాన్ని గ్రహించాలని సీఎం పేర్కొన్నారు. త్వరితగతిన భూ సేకరణ పూర్తి చేయాలని సూచించారు.

## రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి విమాన సర్వీసు

**న్యూఢిల్లీ:** రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి విమాన సర్వీసును పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. దిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్ నుంచి ఎంపీ పురందేశ్వరితో కలిసి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దేవీ నవరాత్రుల్లో తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. టికెట్ ధర మొదటి 35 సీట్లకు రూ.1999, తర్వాత 35 సీట్లకు రూ.4000 మూడు నెలలపాటు అందుబాటులో ఉంటుందన్నారు. దిల్లీ, ముంబయికి ప్రారంభించిన విమాన సర్వీసులు నిండుగా నడుస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో షిర్డీ, వారణాసి, కొచ్చి తదితర ప్రాంతాలకు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ తిరుపతికి విమాన సర్వీసును ప్రారంభించుకోవడం శుభపరిణామమని చెప్పారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఇది ఎంతో దోహద పడుతుందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని

# సమర్థంగా స్థానిక ఎన్నికల నిర్వహణ

### సాంకేతికతను ఉపయోగించుకుని వెళతాం

### తెలంగాణలో శాంతి భద్రతలకు పెద్దపీట

### ఖాళీల భర్తీని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతా

### నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన శివధర్ రెడ్డి

**హైదరాబాద్:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన శివధర్ రెడ్డి తెలిపారు. మాకు బలమైన జట్టు ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతికతను వినియోగించుకుంటాం అన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని నూతన డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నూతన డీజీపీగా ఆయన లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వేద మంత్రాలతో డీజీపీ కార్యాలయంలోకి ఆయన్ను పండితులు ఆహ్వానించారు. తెలంగాణ 6వ డీజీపీగా 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ డీజీపీగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని ఇటీవల నక్సల్స్ నేత లేఖ రాశారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని వారిని కోరుతున్నాం. మావోయిస్టుల సిద్ధాంతాలు ఆచరణలో విఫలమయ్యాయని భావిస్తున్నాం. లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలో పోలీసుస్టేషన్ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణలో శాంతి భద్రతలు కాపాడం మా మొదటి కర్తవ్యం. తెలంగాణ అభివృద్ధికి, పెట్టుబడులు రాకకు లా అండ్ ఆర్డర్ ఎంతగానో దోహదపడుతుంది. మా ముందు ఉన్న లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించడం. మీడియా సహకారం చాలా అవసరం. పోలీస్ శాఖలో 17 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయి, వాటిని భర్తీ చేయాలి. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడండి. మావోయిస్టులపై నమోదు అయిన కేసులు విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తా. మావోయిస్టుపై వేధింపులు ఉండవు. ప్రభుత్వం ముందు మీరు ఆత్మసమర్పణ చేసుకోండి, ముందుకు రండి. మావోయిస్టు పార్టీ నుండి బయటికి రండి. మావోయిస్టు పొలిట్ బ్యూరో సుజాత ఇటీవలే మావోయిస్టు పార్టీని వీడారు. వేణుగోపాల్ ఇచిన స్టేట్మెంట్ జగన్ ఖండించారు. మావోయిస్ట్ నేత జగన్ ఇచిన స్టేట్మెంట్ అందరూ చూసాం. వీరి మధ్యలో సమస్యలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మావోయిస్టులకు అందించాల్సిన బెనిఫిట్స్ అందిస్తాం. సైబర్ క్రైమ్ నేరాలు అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. పోలీస్ సిబ్బంది స్కిల్స్ పెంచుతాం. బేసిక్ పోలింగ్ అండ్ విజువల్ పోలీసింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఇంప్రూవ్ చేస్తాము' అని కొత్త డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.

# కృష్ణానదికి పెరుగుతున్న వరద

### దసరా నాడు నిర్వహించే అమ్మవారి తెప్పోత్సవం రద్దు

**విజయవాడ:** విజయవాడ ఇంద్రకీలాద్రీపై దేవీ శరన్నవరాత్రోవాలు అట్టహాసంగా కొసాగుతున్నాయి. 10వ రోజు ఇవాళ మహా నవమి పర్వదినాన మహిషాసుర మర్ధిని అవతారంలో అమ్మవారు యాత్రికులకు దర్శనమిస్తున్నారు. కాగా దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా విజయదశమి రోజున నిర్వహించే హంస వాహన తెప్పోత్సవం ఈ ఏడాది అనూహ్యంగా రద్దు చేశారు. కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద వస్తున్న నేపథ్యంలో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహణ అసాధ్యమని నీటి పారుదల శాఖ ఆలయ కమిటీకి సూచించింది. ప్రస్తుతం కృష్ణా నదిలోకి వరద ప్రవాహం 6.5 లక్షల క్యూసెక్కులకు మించి ఉందని.. ఇది ఇంకా పెరిగి చాన్స్ ఉందని నీటీ పారదుల శాఖ అధికారులు స్పష్టం చేశారు. రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న క్రమంలో హంస వాహన తెప్పోత్సవాన్ని ఆలయ అధికారులు రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఇంద్రకీల్రాదిపై దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా విజయదశమి రోజున నిర్వహించే హంసవాహన తెప్పోత్సవం ఈ ఏడాది రద్దు అయింది. కృష్ణా నదికి భారీగా వరద వస్తున్న తరుణంలో ఆనవాయితీగా వస్తున్న అమ్మవారి తెప్పోత్సవం నిర్వహణ అసాధ్యమని నీటిపారుదలశాఖ అభిప్రాయపడింది. తెప్పోత్సవానికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు నిరాకరించింది. 2022, 2023లో కూడా దశమి రోజు వర్షం కురవడంతో తెప్పోత్సవాన్ని రద్దు చేశారు. మహా మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. గతేడాది వరద ఉద్ధృతి ఎక్కువగా ఉన్న కారణంగా నది ఒడ్డున దుర్గాఘాట్‌పై సిద్ధం చేసిన హంస వాహనంపై పూజ కార్యక్రమం మాత్రమే నిర్వహించారు. ఈ ఏడాది వరద ప్రవాహం ఆరున్నర లక్షల క్యూసెక్కులకు మించి ఉంది. ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో తెప్పోత్సవ నిర్వహణను అధికారులు రద్దు చేశారు.



# దసరారోజు రావణ దహనం

### ఉత్తరాదిలో ఏటాసందడి

**విజయవాడ:** దసరా పండుగ హిందువులకు చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఇది చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచిస్తుంది. శ్రీరాముడు రావణుడిని ఓడించిన విజయాన్ని, అలాగే దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించిన విజయాన్ని గుర్తుచేస్తుంది. దసరా రోజున రావణ దహనం చేయడం, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం వంటి సంప్రదాయాలు ఉంటాయి. ఇకపోతే ప్రతి సంవత్సరం దసరా వచ్చినప్పుడు, దేశవ్యాప్తంగా రావణుడి దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. ముఖ్యంగా ఉత్తరాదిలో ఢిల్లీ సహా అనేకరాష్ట్రాల్లో రావణదహనం చేస్తారు. మత విశ్వాసాల ప్రకారం, రావణుడికి పది తలలు బ్రహ్మ ఇచ్చిన వరంగా వచ్చాయి. అతను బ్రహ్మను ప్రసన్నం చేసుకోవడానికి తీవ్రమైన తపస్సు చేసి, తనను తాను పదిసార్లు శిరచ్ఛేదం చేసుకున్నప్పుడు, అతని అంకితభావానికి మెచ్చిన బ్రహ్మ అతని అపారమైన జ్ఞానం, శక్తికి చిహ్నంగా పది తలల వరం ఇచ్చారని పురాణాలు చెబుతున్నాయి. అయితే, రావణాసురుడి పది తలలు అతని 10 ముఖ్య లక్షణాలను కూడా సూచిస్తాయి. రావణుడికి ఎంత జ్ఞానం ఉన్నా.. సకల సంపదలు కలిగి ఉన్నా.. మితిమీరిన కోరికల వల్ల అతడు ఏదీ అనుభవించలేకపోయాడు. రావణుడు తన జ్ఞానం, శక్తి పట్ల గర్వపడ్డాడు, చివరికి అది అతని పతనానికి దారితీసింది. రావణుడిని దహించే సంప్రదాయం, దుష్టత్వాన్ని శిక్షించి, ధర్మాన్ని నిలబెట్టడానికి జరుగుతుంది. రావణుడు రాముడి భార్య అయిన సీతను అపహరించి, తన సొంత రాజ్యమైన లంకలో బంధించాడు. సీతను విడిపించుకోవడానికి, రావణుడిని ఓడించి, ధర్మాన్ని స్థాపించడానికి రాముడు రావణుడితో యుద్ధం చేసి అతన్ని సంహరించాడు.



# లిక్కర్ లోడ్‌తో వెళుతున్న డిసిఎంకు ప్రమాదం

### బాటిళ్లు ఎత్తుకెళ్లిన జనం

**హైదరాబాద్:** హైదరాబాద్ రామంతపూర్‌లో లిక్కర్ లోడ్‌తో వెళుతున్న డిసిఎం విద్యుత్ ప్రమాదానికి గురయ్యింది. డ్రైవర్ అప్రమత్తతో ప్రమాద తప్పింది. సకాలంలో మంటలను ఆర్పారు. అయితే కొందరు చెల్లాచెదురుగా పడివున్న బాటిళ్లను ఎత్తుకెళ్లారు. లిక్కర్ లోడ్ డీసీఎంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్న ఘటన చోటు చేసుకుంది. కరెంట్ వైర్లు కిందికి ఉండటం వల్ల డీసీఎం షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు వ్యాపించడాన్ని గమనించి వెంటనే ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో మంటల ప్రభావంతో డీసీఎంలో ఉన్న లిక్కర్ బాటిల్స్ కొంతవరకు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉంటే.. మంటల వల్ల రోడ్డు మీద కొన్ని మద్యం సీసాలు పడ్డాయి. ఇది చూసిన పబ్లిక్ అందిన కాడికల్లా రోడ్డు మీద పడ్డ సీసాలను సేకరించారు. పలువురు స్థానికులు ఆ సీసాలను ఎత్తుకెళ్లారు. స్థానిక పోలీసులు ఈ ఘటనపై సమాచారాన్ని సేకరిస్తూ మద్య నిల్వ, విద్యుత్ సేఫ్టీ అంశాలను పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా షార్ట్ సర్క్యూట్ కారణాలను గుర్తించడానికి డిపార్ట్‌మెంట్ దర్యాప్తు కొనసాగిస్తోంది.